క్లుప్తంగా

దుర్గగుడి వైదిక కమిటీలో మార్పులు

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): శ్రీదుర్గా మల్లేశ్వర స్వామి వార్ల దేవస్థాన వైదిక కమిటీలో మార్పులు చేస్తూ ఆలయ ఈవో కె.రామచంద్రమోహన్ శనివారం ఆదేశాలు జారీ చేశారు. ఈ వైదికలో ఆలయ స్థానాచార్య వి. శివప్రసాద్ శర్మ, ప్రధాన అర్చకులు ఎల్. దుర్గాప్రసాద్, వేద పండితులు సీహెచ్ ఆంజనేయ ఘనాపాటి, వి.శ్యామస్య మహర్షి, ప్రధాన అర్చకులు వై. మల్లేశ్వర శాస్త్రి, ఉప ప్రధాన అర్చకులు కెఎస్‌విడిఎం. ప్రసాద్‌లను నియమిస్తూ ఆదేశాలు జారీ చేశారు. వైదిక కమిటీ సభ్యులు దేవస్థానానికి సంబంధించి అన్ని ముఖ్య వైదిక విషయాలు, ముహూర్తాల నిర్ణయంతో పాటు ఆలయ ఈవోకు సూచనలు, సలహాలను అందిస్తుంది.

అంబేడ్కర్‌ను అవమానించిన దోషులను శిక్షించాలి

భవానీపురం(విజయవాడపశ్చిమ): భారత రాజ్యాంగ రూపశిల్పి డాక్టర్ బీఆర్ అంబేడ్కర్‌ను అవమానించిన దోషులను అరెస్ట్ చేసి కఠినంగా శిక్షించాలని వైఎస్సార్ సీపీ ఎస్టీఆర్ జిల్లా అధికార ప్రతినిధి పొదిలి చంటిబాబు ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. తూర్పు గోదావరి జిల్లా నల్లజర్ల మండల పరిధిలోని దూబచర్ల గ్రామం గాంధీకాలనీలోగల అంబేడ్కర్ విగ్రహం మెడలో శుక్రవారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు చెప్పుల దండ వేయటాన్ని ఆయన తీవ్రంగా ఖండించారు. ఈ దుర్ఘటన వెనుక రాజకీయ కుట్ర ఉన్నట్లు అనుమానం వ్యక్తం చేశారు.

విద్యార్థులు పోటీతత్వాన్ని పెంపొందించుకోవాలి



వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): విద్యార్థులు పోటీతత్వాన్ని పెంపొందించుకోవాలని జిల్లా సైన్స్ అధికారి డాక్టర్ మైనం హుస్సేన్ అన్నారు. జిల్లా విద్యాశాఖ ఆధ్వర్యంలో స్వర్ణాంధ్ర-2047 పేరుతో ఆరు నుంచి తొమ్మిదో తరగతి విద్యార్థులకు వివిధ పోటీలను స్థానిక బిషప్ అజరయ్య ఉన్నత పాఠశాల ప్రాంగణంలో శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా వ్యక్తృత్వం, వ్యాసరచన, పోస్టర్ మేకింగ్ తదితర పోటీలను నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన మైనంహుస్సేన్ మాట్లాడుతూ విద్యార్థులు విద్యతో పాటుగా క్రమశిక్షణతో ముందుకు అడుగులు వేస్తే మరిన్ని విజయాలను పొందుతారని చెప్పారు. సమగ్ర శిక్ష విభాగ ఎంఎంఓ అశోక్ మాట్లాడుతూ విద్యార్థులు మారుతున్న కాలానుగుణంగా ఆయా రంగాల్లో వస్తున్న మార్పులను గమనించాలన్నారు. కార్యక్రమంలో అసిస్టెంట్ ఎఎంఓ శిరీషారాణి, నోడల్ ఆఫీసర్ సుధాకర్, జిల్లాలోని వివిధ ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల విద్యార్థులు పాల్గొన్నారు.

పేద ముస్లిం మహిళలకు చీరల పంపిణీ

భవానీపురం(విజయవాడపశ్చిమ): పవిత్ర రంజాన్ మాసాన్ని పురస్కరించుకుని ఫకీర్ ముస్లిం వెల్ఫేర్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు షేక్ హిమవలి ఆధ్వర్యంలో జక్కంపూడి వైఎస్సార్ కాలనీలో శనివారం పేద ముస్లిం మహిళలకు చీరలు పంపిణీ చేశారు. ముఖ్యఅతిథులుగా స్థానిక ఎంపీటీసీ షేక్ సైదాబీ, వైఎస్సార్ సీపీ రాష్ట్ర మైనార్టీ సెల్ జాయింట్ సెక్రటరీ, ఆజాద్ ముస్లిం కమిటీ రాష్ట్ర అధ్యక్షుడు షేక్ నాగూర్ మీరా పాల్గొన్నారు. సభ్యులు మౌలాలి, సలాం, యాకూబ్, షేక్ నాగుల్, బాషి, కాలేషా, విన్నపాల రంగారావు తదితరులు పాల్గొన్నారు.

వ్యక్తి అదృశ్యంపై కేసు నమోదు

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): బంధువుల ఇంటికి వచ్చిన వ్యక్తి అదృశ్యమైన ఘటన భవానీపురం పోలీసు స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. నెల్లూరు జిల్లా కందుకూరు మండలం వల్లేటివారిపాలేనికి చెందిన బ్రహ్మానందరెడ్డి ఈనెల 6వ తేదీన విజయవాడ ఊర్మిళా నగర్‌లో ఉంటున్న బంధువు వెంకటనారాయణ రెడ్డి ఇంటికి వచ్చాడు. మరుసటి రోజు 7వ తేదీ రాత్రి సొంత గ్రామానికి వెళుతున్నానని చెప్పి తిరుగు పయనమయ్యాడు. కానీ ఈ రోజు వరకు సొంతూరు వెళ్లలేదు. బంధువులు, స్నేహితులను ఆరా తీసినా ఆచూకీ లభించలేదు. దీంతో తన కుమారుడు కనిపించడం లేదంటూ పోలీసులను ఆశ్రయించారు.

శిథిలావస్థలో మున్సిపల్ డిస్పెన్సరీ

- పెచ్చులూడిపోయి ఐరన్ సువ్వలు బయటపడిన వైనం
- వర్షాలకు తడిసి కంపు కొడుతున్న గోడలు
- ఎప్పుడు కూలిపోతుందో తెలియని పరిస్థితి
- అందులోనే ప్రజలకు వైద్య సేవలు



విద్యాధరపురం మున్సిపల్ డిస్పెన్సరీ

భవానీపురం(విజయవాడపశ్చిమ): శిథిలావస్థలో ఉన్న పురాతనమైన హాస్పటల్ భవనం భారీ వర్షాలకు గాలి తోడయితే కూలిపోయే పరిస్థితి. గత కొన్నేళ్ల నుంచి కురుస్తున్న వర్షాలకు హాస్పటల్ గోడలన్నీ చెమ్మగిల్లి, మరకలతో ముక్క కంపు కొడుతున్నాయి. అదే విధంగా భవనం శ్లాబ్ పెచ్చులూడిపోయి లోపల ఉండే ఇనుప చువ్వలు బయటపడ్డాయి. ఈ విధంగా పెచ్చులూడి పడిపోవడం నిరంతర ప్రక్రియ.

ఆయుర్వేద హాస్పటల్స్‌లో వైద్యుల కొరత

నగరం మొత్తం మీద 12 ఆయుర్వేద వైద్య చికిత్స కేంద్రాల్లో వైద్యుల కొరత వెంటాడుతుంది. విద్యాధరపురం మున్సిపల్ డిస్పెన్సరీలో పని చేస్తున్న డాక్టర్ కొత్తపేట, వించిపేట హాస్పటల్స్‌కు ఇన్‌చార్జ్ వైద్యుడిగా ఉండటమే అందుకు ప్రత్యక్ష నిదర్శనం. ఆయా వైద్య కేంద్రాల్లో పని చేసిన వైద్యులు కాలక్రమంలో కొందరు రిటైర్ అవుతుండగా వారి స్థానంలో కొత్తగా మరొకరిని నియమించకపోవడంతో ఒక డాక్టరే రెండు, మూడు హాస్పటల్స్‌కు ఇన్‌చార్జ్‌లుగా పని చేయాల్సిన పరిస్థితి నెలకొంది. మొత్తం 12 హాస్పటల్స్‌లో ఇద్దరు మాత్రమే శాశ్వత వైద్యాధికారులు ఉండగా, ఆరుగురు కాంట్రాక్ట్ బేసిస్‌పై విధులు నిర్వర్తిస్తున్నారు. మిగిలిన నాలుగు హాస్పటల్స్ (కొత్తపేట, అజిత్‌సింగ్ నగర్, కృష్ణలంక, దుర్గాపురం)లో ఖాళీగా ఉన్న వైద్యాధికారుల పోస్టులను భర్తీ చేయాల్సి ఉంది. ఇందుకు ప్రభుత్వ అనుమతి కోరుతూ స్థాయి సంఘం ఆమోదం కోసం ఆఫీస్ సూచనను ఇటీవల జరిగిన స్టాండింగ్ కమిటీ ముందు పెట్టారు. ఈ నేపథ్యంలో కొందరు వైద్యులకు అదనపు బాధ్యతలను అప్పగించటంతో ఆయా డిస్పెన్సరీలలో ఎక్కువ సమయం గడపలేక, రోగులకు పూర్తిస్థాయిలో న్యాయం చేయలేక వైద్యులు అల్లాడిపోతున్నారు.



మందులు ఇచ్చే గదిలో పెచ్చులూడిపోయి శ్లాబ్‌లో ఐరన్ సువ్వలు బయటపడిన దృశ్యం

సెలవు దొరక్క మనోవేదన...

అలాగే కుటుంబసభ్యులతో గడపాలన్నా, అనారోగ్యం చేసినా సెలవు దొరకక తీవ్ర మనోవేదనకు గురవుతున్నారు. వాస్తవానికి ఒక్కో డిస్పెన్సరీలో ఒక డాక్టర్‌తోపాటు నలుగురు సిబ్బంది ఉండాలి. ఒక మేల్ నర్సు, ఒక ఫిమేల్ నర్సు, కాంపౌండర్, వాచ్‌మెన్ ఉండాలి. అయితే ఏ డిస్పెన్సరీలోను పూర్తి స్థాయి సిబ్బంది లేకపోవడం గమనార్హం. ఈ మేరకు ఆయా డిస్పెన్సరీలలో పని చేసే వైద్యులుకూడా సంబంధిత అధికారుల దృష్టికి తీసుకువెళ్లుతున్న దాఖలాలు కూడా కనిపించటం లేదు. తెలియపరిచినా ఫలితం ఉండదని, ఆ మాత్రం దానికి తాము ఎందుకు చెడ్డ కావాలన్నది వారి భావనగా ఉన్నట్లు తెలుస్తోంది.

అనుబంధంగా మలేరియా హాస్పటల్......

విద్యాధర పురం మున్సిపల్ ఆయుర్వేద డిస్పెన్సరీకు అనుబంధంగా దానికి ఆనుకుని ఉన్న మున్సిపల్ మలేరియా పరీక్షా కేంద్రం రేకుల షెడ్ కొంత వరకు పరవాలేదు. ఇందులోనే టీబీ పరీక్ష కేంద్రంకూడా ఉంది. వాటి రిపోర్ట్‌లను తీసుకుని డిస్పెన్సరీకి వెళితే అందుకు అవసరమైన మందులు (ఉంటే) అందజేస్తున్నారు. ఇదే రేకుల షెడ్‌లో స్థానిక శానిటరీ కార్యాలయంతోపాటు జనన, మరణ సబ్ రిజిస్టర్ కార్యాలయం కూడా ఉన్నాయి. సాయంత్రానికి ఇవన్నీ మూసేసి ఉండటంతో అక్కడ ఎవరూ సంచరించరు. దాంతో గంజాయి, బ్లేడ్ బ్యాచ్‌కి చెందిన కొందరు అక్కడికి చేరుకుని తమ అసాంఘిక కార్యకలాపాలు కొనసాగిస్తున్నారు.

బిక్కు బిక్కుమంటూ.......

శ్లాబ్ పెచ్చులు ఎప్పుడు తమ మీద పడతాయేనని అటు వైద్యుడు.. ఇటు వైద్యం కోసం హాస్పటల్ వచ్చే ప్రజలు ఆందోళన చెందుతున్నారు. లోపలకు వెళ్లి బయటకు వచ్చే వరకు ప్రాణాలు అరచేతిలో పెట్టుకుని బిక్కుబిక్కుమంటూ ఉంటున్న దుస్థితి. మొత్తం మీద పురాతనమైన హాస్పటల్ భవనం ఎప్పుడు కూలిపోతుందో తెలియని అయోమయ, ఆందోళనకర పరిస్థితి నెలకొంది. అదే గట్టు వెనుక ప్రాంతం విద్యాధరపురం కుమ్మరిపాలెం సెంటర్‌లోని నగరపాలక సంస్థకు చెందిన విద్యాధరపురం మున్సిపల్ డిస్పెన్సరి (ఆయుర్వేద హాస్పటల్). ఆరోగ్యానికి భరోసా కల్పించాల్సిన నగర పాలక సంస్థ ప్రజారోగ్యశాఖ అధికారులు రోగుల ప్రాణాలకు భరోసా కల్పించ లేకపోకపోవడం గమనార్హం. ఈ హాస్పటల్ పక్కనే ఉన్న పన్నులు కట్టించుకుని చిన్న భవనం, దానికి ఆనుకునే నిరుపయోగంగా ఉన్న వ్యాయామ శాల (జిమ్), అలాగే ఆయుర్వేద హాస్పటల్‌కు అనుబంధంగా ఉన్న మలేరియా పరీక్షా కేంద్రం షెడ్‌లను కూల్చేసి జీ ప్లస్ టు భవనం నిర్మిస్తే అన్నింటికీ ఉపయుక్తంగా ఉంటుందని 38వ డివిజన్ కార్పొరేటర్ షేక్ రెహమతున్నీసా ఇటీవల మున్సిపల్ కమిషనర్‌కు వినతి పత్రం అందజేయటం, ఆయన వచ్చి పరిశీలించి వెళ్లటం జరిగాయి.



డిస్పెన్సరీలోని వైద్యుని గదిలో కిటికీపైన పెచ్చులూడి పడిపోయే పరిస్థితి

మత సామరస్యానికి ప్రతీక ఇఫ్తార్



భవానీపురం(విజయవాడపశ్చిమ): కులమతాలకు అతీతంగా పవిత్ర రంజాన్ మాసంలో ఏర్పాటు చేసే ఇఫ్తార్ విందు మత సామరస్యానికి ప్రతీక అని వైఎస్సార్ సీపీ పీఏసీ సభ్యులు, పశ్చిమ నియోజకవర్గ పార్టీ ఇన్‌చార్జ్ వెలంపల్లి శ్రీనివాసరావు పేర్కొన్నారు. రంజాన్ మాసాన్ని పురస్కరించుకుని పార్టీ నాయకుడు షేక్ హయాత్ షరీఫ్ ఆధ్వర్యంలో తాజ్ మసీదు వద్ద శనివారం ఇఫ్తార్ విందు నిర్వహించారు. కార్పొరేటర్ ఎండీ ఇర్ఫాన్, తాజ్ మసీద్ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

ప్రకృతి వనరులు భవిష్యత్ తరాలకు అందించాలి

మొగల్రాజపురం(విజయవాడ తూర్పు): ప్రకృతి నుంచి మనం పొందుతున్న సహజ వనరులను భవిష్యత్ తరాలకు అందించాల్సిన బాధ్యత అందరిపై ఉందని కేసీపీ గ్రూప్ ఈహెచ్ఎస్ విభాగాధిపతి డాక్టర్ జి.బాలకృష్ణ అన్నారు. సుస్థిర భవిష్యత్‌ను నిర్దేశించే పర్యావరణ, సామాజిక పాలన కారకాలు అనే అంశంపై ఐసీఎస్ఎస్ఆర్-ఎస్ఆర్‌సీ సహకారంతో పీబి సిద్ధార్థ కళాశాల ఎంబీఏ విభాగం ఆధ్వర్యంలో వెబినార్ హాల్‌లో నిర్వహిస్తున్న జాతీయ సదస్సు ముగింపు సభ శనివారం జరిగింది. ముఖ్య అతిథి బాలకృష్ణ మాట్లాడుతూ.. ప్రపంచీకరణ నేపథ్యంలో అభివృద్ధి చెందుతున్న దేశాల్లో పారిశ్రామికవేత్తలు నాణ్యతా ప్రమాణాలతో పాటుగా నైతిక విలువలను పాటించాలన్నారు. గౌరవ అతిథి, సేఫ్ ఎన్విరాన్‌మెంట్ ప్రైవేట్ లిమిటెడ్ చైర్మన్ వి.వెంకటేశ్వరరావు మాట్లాడారు.

వసంత నవరాత్రోత్సవాల్లో విశేష పుష్పార్చనలు

ఆర్జిత సేవా టికెటు రూ.2,500

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): ఈ నెల 30వ తేదీ నుంచి ఇంద్రకీలాద్రిపై శ్రీదుర్గా మల్లేశ్వర స్వామి వార్ల దేవస్థానంలో వసంత నవరాత్రోత్సవాలు నిర్వహిస్తారు. ఈనెల 30వ తేదీ నుంచి ఏప్రిల్ 7వ తేదీ వరకు జరిగే నవరాత్రోత్సవాలలో అమ్మవారికి ప్రతి నిత్యం విశేష పుష్పార్చన నిర్వహించేందుకు వైదిక కమిటీ నిర్ణయించింది. ప్రతి రోజు ఉదయం 9 గంటలకు ఆలయ ప్రాంగణంలోని లక్ష్మీ గణపతి విగ్రహం వద్ద అమ్మవారి ఉత్సవ మూర్తికి పుష్పార్చన జరుగుతుంది. విశేష పుష్పార్చనలో పాల్గొనే ఉభయదాతలు రూ.2500 టికెటు కొనుగోలు చేయాల్సి ఉంటుంది. ఈ టికెటుపై ఇద్దరు సేవలో పాల్గొనడంతో పాటు వారికి అమ్మవారి అంతరాలయ దర్శనం, శేషవస్త్రం, అమ్మవారి శ్రీచక్రపీఠం, పెద్ద లడ్డూను అందజేస్తారు.

ఏ రోజు ఏ పుష్పాలంటే...!

ఈనెల 30వ తేదీ ఆదివారం మల్లెపూలు, మరువం , 31వ తేదీ సోమవారం కనకాంబరాలు, గులాబీలు, ఏప్రిల్ 1వ తేదీ మంగళవారం చామంతి, ఇతర పూలు, 2వ తేదీ బుధవారం మందార పూలు, ఎర్రకలువలు, 3వ తేదీ గురువారం తెల్ల జిల్లేడు, మారేడు, తులసీ, మరువం, ధవళం, 4వ తేదీ శుక్రవారం కాగడా మల్లెలు, జాజులు, మరువం, 5వ తేదీ శనివారం ఎర్ర తామరపూలు, ఎర్ర గన్నేరు, సన్నజాజులు, 6వ తేదీ ఆదివారం చామంతి, సంపంగిపూలు, 7వ తేదీ సోమవారం కనకాంబరాలు, గులాబీలతో అర్చన నిర్వహిస్తారు. విశేష పుష్పార్చన అనంతరం అమ్మవారికి సమర్పించిన పుష్పాలను భక్తులకు పంపిణీ చేస్తారు.

నగరంలో శ్రీవారి ఉదయాస్తమాన సేవలు

లబ్బీపేట(విజయవాడతూర్పు): తిరుమల శ్రీ వెంకటేశ్వర స్వామి వారి సన్నిధిలో నిర్వహించే ఉదయాస్తమాన సేవల తరహాలో విజయవాడలోనూ నిర్వహించారు. రోటరీ క్లబ్ ఆఫ్ విజయవాడ మిడ్ టౌన్ ఆధ్వర్యంలో బృందావన కాలనీలోని ఎ.కన్వెన్షన్ సెంటర్‌లో శ్రీ వారి ఆలయం తరహాలో తీర్చిదిద్ది సేవలను నిర్వహించారు. సుప్రభాత సేవ, తోమాల సేవ, సహస్ర నామార్చన, పసుపు కొట్టడం, అష్టోత్తర శతకలశాభిషేకం వంటివి శాస్త్రోక్తంగా నిర్వహించారు. సెంట్రల్ శాసనసభ్యుడు బొండా ఉమామహేశ్వరరావు, జనసేన పార్టీ ఎన్టీఆర్ జిల్లా అధ్యక్షుడు సామినేని ఉదయభాను, మాజీ మంత్రి వైఎస్సార్‌సీపీ వెస్ట్ ఇన్‌చార్జి వెలంపల్లి శ్రీనివాసరావు తదితర ప్రముఖులు స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. శ్రీ వెంకటేశ్వర స్వామి వారి ఉదయాస్తమాన సేవలు రెండు రోజుల పాటు నిర్వహించడం అభినందనీయమని రోటరీ క్లబ్ ప్రతినిధులను వారు అభినందించారు. ఈ సందర్భంగా రోటరీ క్లబ్ మిడ్ టౌన్ అధ్యక్షుడు గుడిపాటి కిషోర్ మాట్లాడుతూ తిరుమలలో జరిగే విధంగా ఉదయాస్తమాన సేవలు నిర్వహిస్తున్నామని చెప్పారు. తిరుమల శ్రీవారి సన్నిధిలో ఉదయం నుంచి సాయంత్రం వరకు జరిగే ప్రతి సేవను కనులారా వీక్షించాలని భక్తులు భావిస్తారని, అందుకే విజయవాడలో రెండు రోజుల పాటు ఈ కార్యక్రమాలు ఉచితంగా వీక్షించేలా ఏర్పాట్లు చేశామన్నారు. ఆదివారం కూడా ఈ సేవలు కొనసాగుతాయన్నారు. క్లబ్ చైర్మన్ శ్రీనివాస్ బాలాజీ, కన్వీనర్ యడ్ల పార్థసారథి, సెక్రటరీ బి.సుందర్ రెడ్డి, కాసుల బ్రహ్మం, సంపత్, వనమా గణేష్, చారుగుండ్ల రమేష్, నంబూరు జీవన్ తదితరులు పాల్గొన్నారు.



శ్రీవారి ఉదయాస్తమాన సేవల్లో భక్తులు

నీటి కొరత తీవ్రతరం కానుంది

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): పర్యావరణ మార్పుల కారణంగా రానున్న కాలంలో నీటి కొరత మరింత తీవ్ర తరం కానుందని ఏపీ ప్రభుత్వ సాంకేతిక సలహాదారు తోట ప్రభాకరరావు అన్నారు. పొట్టిశ్రీరాములు చలవాది మల్లికార్జునరావు కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీ ఈఈఈ విభాగం ఆధ్వర్యంలో ప్రపంచ జలదినోత్సవాన్ని పురస్కరించుకొని నీటి అవశ్యకతపై సదస్సును శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా తోట ప్రభాకరరావు మాట్లాడుతూ వాతావరణ మార్పుల కారణంగా హిమలయాల్లోని నదులు గతం కంటే వేగంగా కరుగుతున్నాయన్నారు. దీనివలన మిలియన్ల మంది ప్రజల జీవనోపాధిని కోల్పోవటమే కాకుండా పర్యావరణ వ్యవస్థలకు నష్టం కలుగుతుందన్నారు. వాటిని రక్షించుకోవటానికి అందరూ పాటుపడాలన్నారు. జలవనరుల కాలుష్యం, క్షీణత నుంచి రక్షించుకోవటానికి దీర్ఘకాలిక నీటి భద్రతా చర్యలను చేపట్టాల్సిన అవసరాన్ని ఆయన వివరించారు. నీటికొరత ప్రజారోగ్యాన్ని సైతం ప్రభావితం చేస్తుందన్నారు. నీటి పారుదల, నీటి పునర్వినియోగం, వర్షపునీటి సేకరణతో సహాయ స్థిరమైన డీశాలినేషన్ తదితర అంశాలపై ఆయన ప్రసంగించారు. సభకు అధ్యక్షత వహించిన కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్. శరవణకుమార్ మాట్లాడుతూ విద్యార్థులు నీటి అవశ్యతను తెలుసుకోవటంతో పాటుగా పర్యావరణ పరిరక్షణకు పాటుపడాలన్నారు. కార్యక్రమంలో విభాగాధిపతి డాక్టర్ కె. సురేష్ బాబు, అధ్యాపకులు ఆర్.జయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు ఉన్నత స్థాయికి ఎదగాలి

విజయవాడ ఎంపీ కేశినేని శివనాథ్

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): విద్యార్థులు తమ కాళ్లపై తాము నిలబడే విధంగా ఉన్నతస్థాయికి ఎదగాలని విజయవాడ పార్లమెంట్ సభ్యుడు కేశినేని శివనాథ్ అన్నారు. కాకరపర్తి భావనారాయణ కళాశాల 60 వార్షికోత్సవ వేడుకలను పురస్కరించుకొని రెండో రోజు స్పోర్ట్స్‌డే వేడుకలు శనివారం సాయంత్రం ఆ కళాశాల ప్రాంగణంలో సందడిగా జరిగాయి. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన ఎంపీ కేసినేని శివనాథ్ మాట్లాడుతూ విద్యార్థులు చిన్నతనం నుంచే సేవా భావం అలవర్చుకోవాలని సూచించారు. విద్యార్థులు స్వయంకృషితో పారిశ్రామికవేత్తలుగా ఎదగాలని కోరారు. విజయవాడ వెస్ట్ ఏసీపీ దుర్గారావు మాట్లాడుతూ విద్యార్థులు క్రమశిక్షణతో ఎదగాలన్నారు. అనంతరం వివిధ స్థాయిల్లో బహుమతులు అందుకున్న విద్యార్థులకు ఎంపీ చేతుల మీదుగా సర్టిఫికెట్లు, మెడల్స్ అందజేశారు. కార్యక్రమంలో కళాశాల కార్యదర్శి టి.శ్రీనివాసు, టీడీపీ నేత ఎంఎస్ బేగ్, హిందూ హైస్కూల్స్ కమిటీ కోశాధికారి గోళ్ల బాబా విజయకుమార్, హిందూ హైస్కూల్స్ కమిటీ అడ్మినిస్ట్రేటివ్ అధికారి డాక్టర్ వీ నారాయణరావు, కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ జీ కృష్ణవేణి, వ్యాయామ అధ్యాపకులు డి. హేమచంద్రరావు, వైస్ ప్రిన్సిపాల్స్ ఎం వెంకటేశ్వరరావు, పిఎల్ రమేష్, కె. రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎంపీ

27న ఉరుసు మహోత్సవం

భవానీపురం(విజయవాడపశ్చిమ): విజయవాడ భవానీపురంలోని ప్రసిద్ధి గాంచిన హజరత్ సయ్యద్ గాలిబ్ షహీద్ (ర.అలై) అవులియావారి 437వ ఉరుసు గంధం మహోత్సవ ఊరేగింపు ఈ నెల 27వ తేదీన జరుగనుంది. గురువారం రాత్రి 11.45 గంటలకు ఎండీ సులేమాన్ ముజావర్ ఇంటి వద్ద నుంచి గంధం ఊరేగింపు ప్రారంభం అవుతుంది. అక్కడ నుంచి భవానీపురం పురవీధుల గుండా మేళతాళాలు, ఫకీర్ల భక్తి గీతాల నడుమ పలువురు ముస్లిం మైనార్టీల భక్తిపారవశ్యంతో కోలాహలంగా సాగే ఊరేగింపు శుక్రవారం మధ్యాహ్నం 11.30 గంటలకు దర్గా వద్దకు చేరుకుంటుంది. అనంతరం రాత్రి 7 గంటలకు దర్గా వద్ద దీపారాధన, అన్నప్రసాద వితరణ జరగనున్నట్లు దర్గా ముజావర్స్ కమిటీ ఒక ప్రకటనలో తెలిపింది. నాలుగు శతాబ్దాలకుపైగా చరిత్ర ఉన్న భవానీపురం దర్గా ఉరుసు మహోత్సవంలో భక్తులు పాల్గొంటారన్నారు.



విద్యుత్ దీపాల అలంకరణలో దర్గా

విద్యార్థిని అదృశ్యంపై కేసు నమోదు

చిట్టినగర్(విజయవాడపశ్చిమ): ఇంటి నుంచి బయటకు వెళ్లిన 7వ తరగతి విద్యార్థిని అదృశ్యమైన ఘటనపై కొత్తపేట పోలీసులు శనివారం కేసు నమోదు చేశారు. మహంతిపురం జాడ పాపయ్య వీధికి చెందిన షేక్. నూర్, ఆయూబ్ భార్యాభర్తలు. వీరికి ఇద్దరు ఆడపిల్లలున్నారు. కొంత కాలం కిందట భార్యాభర్తలకు విభేదాలు రావడంతో నూర్ పిల్లలతో విడిగా ఉంటుంది. రెండో కుమార్తె (12) వించిపేట గాంధీబొమ్మ సెంటర్‌లోని ఉర్దూ స్కూల్‌లో 7వ తరగతి చదువుతుంది. శుక్రవారం ఉదయం 11-30 గంటల సమయంలో ఇంటి నుంచి బయటకు వెళ్లిన బాలిక తిరిగి రాలేదు. దీంతో ఆందోళన చెందిన తల్లి పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేశారు.

ట్రావెల్ ఎగ్జిబిషన్‌కు తొలిరోజు విశేష స్పందన

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): జాతీయ, అంతర్జాతీయ పర్యాటకాన్ని ప్రోత్సహించడమే లక్ష్యంగా విజయవాడలో ఏర్పాటు చేసిన రెండు రోజుల ఎగ్జిబిషన్ శనివారం ఘనంగా ప్రారంభమైంది. బందర్ రోడ్‌లోని అమరావతి కన్వెన్షన్స్‌లో ఇండియన్ ఇంటర్నేషనల్ ట్రావెల్ ఎగ్జిబిషన్ (ఐఐటీఈ) ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఎగ్జిబిషన్‌కు తొలిరోజు సందర్శకుల నుంచి మంచి స్పందన లభించిందని ఐఐటీఈ డైరెక్టర్ అనురాగ్ గుప్తా చెప్పారు. సంస్థ అందిస్తున్న సేవలను ఆయన వివరించారు. విజయవాడ, చుట్టుపక్కల ప్రాంతాల ప్రజలలో పర్యాటకాసక్తిని పెంపొందించడం, వారి సెలవుల్లో అత్యుత్తమ పర్యాటక అనుభవాలను అందించడం తమ ప్రధాన లక్ష్యమన్నారు. వేసవి సెలవులు, వారాంతపు విహారయాత్రలు, హనీమూన్‌లే కాకుండా ఏడాది పొడవునా సెలవుల్లో ప్రయాణాలు, పర్యాటకానికి అనుకూలమైన అవకాశాలు అందిస్తామన్నారు.



అమరావతి కన్వెన్షన్స్‌లో ప్రారంభమైన ఎగ్జిబిషన్

దుర్గమ్మ సన్నిధిలో కూచిపూడి నృత్య ప్రదర్శన



ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): దుర్గమ్మ సన్నిధిలో అభినయ ఆర్ట్స్ కళా బృందానికి చెందిన పలువురు నృత్యకారులు కూచిపూడి నృత్య ప్రదర్శన ఇచ్చారు. అమ్మవారి ఆలయ ప్రాంగణంలోని రాజగోపురం ఎదుట కళావేదికపై చింతా వెంకట సీతారామాంజనేయులు శిష్య బృందం పలు కీర్తనలకు చక్కటి హావభావాలతో నృత్య ప్రదర్శన ఇచ్చింది. 22 మంది నృత్యకారులు అద్భుతంగా ప్రదర్శించిన కూచిపూడిని భక్తజనం ఆద్యంతం ఎంతో ఆసక్తితో వీక్షించారు. నృత్య ప్రదర్శన అనంతరం కళాకారులను పలువురు భక్తులు అభినందించారు. నృత్యకారులకు అమ్మవారి దర్శనం కల్పించిన ఆలయ అధికారులు ప్రసాదాలు అందజేశారు.

ఆకట్టుకున్న సినీ సంగీత విభావరి



విజయవాడ కల్చరల్: తెలుగు కళావాహిని, కామ్రేడ్ జీఆర్‌కే, పోలవరపు సాహితీ సమితి, శ్రీ కళాభారతి ఆధ్వర్యంలో గాంధీనగర్‌లోని హనుమంతరాయ గ్రంథాలయంలో శనివారం నిర్వహించిన సినీ సంగీత విభావరి ఆకట్టుకుంది. ఒంగోలుకు చెందిన గాయనీ గాయకులు తాళ్ళూరి శ్రీదేవి, అంజిబాబు, అంజుస్వామి, తాళ్ళూరి రవి,, గోవిందరవి, రాజు, స్వామి, చరణ్ రాజ్ తెలుగు, హిందీ చిత్ర గీతాలను ఆలపించారు. కార్యక్రమంలో వివిధ సంస్థల ప్రతినిధులు గోళ్ళ నారాయణరావు, చింతకాయల చిట్టిబాబు, బోడి ఆంజనేయరాజు, కె.డేవిడ్‌రాజు, శింగంశెట్టి చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు. గాయనీ గాయకులను నిర్వాహకులు ఆత్మీయంగా సత్కరించారు.

దుర్గమ్మ సన్నిధిలో చిత్రయూనిట్

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): ఇంద్రకీలాద్రిపై కొలువై ఉన్న దుర్గమ్మను అక్కడ అమ్మాయి ఇక్కడ అబ్బాయి చిత్ర యూనిట్ శనివారం దర్శించుకుంది. అమ్మవారి దర్శనానికి విచ్చేసిన నటుడు ప్రదీప్, నటి దీపికతో పాటు పలువురు యూనిట్ సభ్యులు ఆలయానికి విచ్చేయగా, అధికారులు వారికి సాదరంగా స్వాగతం పలికారు. అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు జరిపించుకున్న అనంతరం వేద పండితులు ఆశీర్వచనం అందచేశారు. అనంతరం ఆలయ అధికారులు ప్రసాదాలు అందించారు. అనంతరం ఆలయ ప్రాంగణంలో చిత్ర యూనిట్ సభ్యులు భక్తులతో మాట్లాడారు. ప్రదీప్, దీపికతో పలువురు భక్తులు ఫోటోలు, సెల్ఫీలు దిగేందుకు పోటీ పడ్డారు.



వేద ఆశీర్వచనం అందుకుంటున్న చిత్రబృందం